ఫలించిన రెండు దశాబ్దాల పోరాటం

ఈడబ్ల్యూఎస్ కాలనీ పార్క్. హైడ్రా స్వాధీనం

కాలనీ వాసుల సంతోషం

అభివృద్ధి సంస్థకు మద్దతుగా కృతజ్ఞతా ర్యాలీ

అమీర్‌పేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీకేగూడ ఈడబ్ల్యూఎస్ కాలనీ స్వచ్ఛ తెలంగాణ యూత్ అసోసియేషన్ చేసిన రెండు దశబ్దాల పోరాట ఫలితం ఎట్టకేలకు నెరవేరింది. కాలనీలోని 102/2 సర్వే నంబర్ లో ఉన్న 1550 గజాల పార్క్ స్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలకు మేరకు గత శనివారం హైడ్రా సీఐ నర్సింహరావు పర్యవేక్షణలో స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. పార్క్ చుట్టూ ఇనుప కంచెను వేసి పబ్లిక్ నోటీసు బోర్డును ఏర్పాటు చేశారు. అసోసియేషన్ ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీకేగుడలో బ్యానర్లు చేతబూని హైడ్రా జిందాబాద్ అనే నినాదాలతో కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు.

విషయం

కాలనీలోని 102/2 సర్వే నంబర్‌లో ఉన్న 1550 గజాల పార్క్ స్థలంలో గుడిసెలు వేసేందుకు కొందరు స్థానికులు యత్నిస్తే తెలంగాణ యూత్ అసోసియేషన్ అడ్డుకుంది. అయినప్పటికీ ఇందులో ప్రైవేట్ వ్యక్తులు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. విసిగిపోయిన అసోసియేషన్ నిర్వాహకులు ఈనెల 3న హైడ్రాకు ఫిర్యాదు చేశారు.



బీకేగూడ ఈడబ్ల్యూఎస్ కాలనీలో హైడ్రా స్వాధీనం చేసుకున్న పార్క్ స్థలం



హైడ్రాకు మద్దతుగా ర్యాలీ చేస్తున్న కాలనీ వాసులు

గతంలో ..

గతంలో అతుల్ కుమార్ అనే వ్యక్తి ఈ స్థలం తనదేనని కోర్టు నుంచి డిగ్రీ సంపాదించి స్థానికుల సహకారంతో పార్క్ చుట్టూ బ్లూ షీట్లను ఏర్పాటు చేశారు. అప్పుడు రంగారెడ్డి కోర్టులో పనిచేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు దివంగత మనోహర్ రావు కోర్టులో కౌంటర్ ఫైల్ దాఖలు చేసి కుమార్ తీసుకొచ్చిన డిగ్రీని డిస్మిస్ చేయించడం తెలిసిందే.

ఆనందంగా ఉంది



మా ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా, ఈడబ్ల్యూఎస్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పార్క్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాలతో హైడ్రా పై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. సంతోషంగా ఉంది.

- రాధా మాధవి అసోసియేషన్ అధ్యక్షురాలు

ఉద్యానవనంగా తీర్చిదిద్దాలి



బీకేగూడ ఈడబ్ల్యూఎస్ కాలనీలో హైడ్రా స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలాన్ని ఉద్యానవనంగా తీర్చిదిద్దాలి. ఈ విషయమై జీహెచ్ఎంసీ, ఉద్యావన శాఖ అధికారులను కలిసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాం.

- వినోద్ కుమార్ అసోసియేషన్ సభ్యులు



సీఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి చిన్నారెడ్డి

సీఎం ప్రజావాణికి 383 దరఖాస్తులు

బేగంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతి బాపూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన సీ.ఎం ప్రజావాణికి మొత్తం 383 దరఖాస్తులు వచ్చాయి. ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లు అర్జీలు తీసుకోవడంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా జిల్లాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు 117, రెవెన్యూకు 51, ఇందిరమ్మ ఇళ్ల కోసం 111, నీటి పారుదల శాఖకు 46, ప్రవాసీ ప్రజావాణికి 1 , ఇతర శాఖలకు చెందిన 57 దరఖాస్తులు వచ్చినట్లు చిన్నారెడ్డి తెలిపారు.

పవర్ బోరు.. బేజారు!

● మనిషి చివరి మజిలీ లోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దహన సంస్కారాలకు వచ్చిన వారికి స్నానం ఆచరించేందుకు వాటికలో ఏర్పాటు చేసిన బోరు పాడైపోయింది. దీంతో ప్రైవేటు ట్యాంకర్లు తెప్పించుకొని స్నానాలు చేస్తున్నారు. ఇక ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. కొందరు స్థానికులు బహిర్భూమికి సైతం వినియోగస్తున్నారని చెబుతున్నారు. బల్కంపేట బీజేఆర్‌నగర్ లోని శ్మశాన వాటికలో దుస్థితి ఇదీ.. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి పవర్ బోర్ కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

అమీర్‌పేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):



బీజేఆర్‌నగర్ శ్మశాన వాటికలో పాడైపోయిన పవర్ బోరు



సింధి కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : నీలిమ

బేగంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. మంగళవారం బేగంపేట డివిజన్ సింధి కాలనీలో అధికారులతో కలిసి ఆమె పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా తాగునీరు సక్రమంగా రావడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని, మురుగు నీరు సమస్య అధికంగా ఉందని స్థానికులు దృష్టికి తీసుకొచ్చారు. అక్కడే ఉన్న అధికారులతో ప్రజలతో మాట్లాడించారు. ఆయా సమస్యలను వీలైనంత వరకు త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పది సంవత్సరాలబీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి ఆగిపోయిందని, తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ, ఎలక్ట్రికల్‌తో పాటు ఆయా విభాగాలకు చెందిన అధికారులు, బేగంపేట కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశాల్ సుదాం తదితరులు పాల్గొన్నారు.



● బీసీ సంఘాల ఆధ్వర్యంలో గన్‌పార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి)



ఎర్రగడ్డలో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులతో ఎంఐఎం నాయకులు మహమ్మద్ అజర్ తదితరులు

అధికారుల తనిఖీలు

ఎర్రగడ్డ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్, పారిశుధ్య పనులను మంగళవారం తెల్లవారుజాము అధికారులు తనిఖీ డ్రైవ్ నిర్వహించారు. వాటర్ వర్క్స్, మున్సిపల్ అధికారులు శ్రీనివాస్, వీరగిరి, జావేద్, నవాబ్‌ల ఆధ్వర్యంలో అధికారులు ఎర్రగడ్డ డివిజన్.. బి శంకర్ లాల్ నగర్, సౌత్ శంకర్ లాల్ నగర్ తదితర బస్తీలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. డివిజన్లోని ప్రజలకు ఎటువంటి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా అన్ని ప్రాంతాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నాయకులు మహమ్మద్ అజర్ కోరారు. తాగునీరు కలుషితమవుతున్న ప్రాంతాలలో పైపులైన్లను పునర్నిర్మించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంఐఎం నాయకులు ఫరాన్, మహారాజ్, మునీర్, నందు, మహమ్మద్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.



● సికింద్రాబాద్ జిల్లా డీసీసీ నూతన అధ్యక్షుడు దీపక్ జాన్‌ను కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ మొహమ్మద్ మొహసిన్ ఖురేషి, వైస్ చైర్మన్ మొహమ్మద్ సర్దార్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణ కుమార్, నాయకులు పెగడ ఆకాష్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

(ఎర్రగడ్డ, నవంబరు 25, ఆంధ్రజ్యోతి)

ఏ రంగంలోనైనా అవకాశాలు సృష్టించాలి

అమీర్‌పేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏ రంగంలోనైనా కొత్త అవకాశాలు సృష్టి అవసరమని అహ్మదాబాద్ యూనివర్శిటీ అమృత్‌మోడీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎకనామిక్ ప్రొఫెసర్ జీమోల్ ఉన్నీ అన్నారు. అమీర్‌పేటలోని ఆర్థిక, సామాజిక అధ్యయనాల కేంద్రం (సెస్) ప్రాంగణంలోని బీపీఆర్ విఠల్ ఆడిటోరియంలో మంగళవారం డాక్టర్ వహీదుద్దీన్ ఖాన్ 19వ స్మారక ఉపన్యాస కార్యక్రమం జరిగింది. సెస్ డైరక్టర్ డాక్టర్ రేవతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఉన్నీ హాజరయ్యారు. సంప్రదాయ వ్యాపారానికి భిన్నంగా డిజిటల్ మార్కెట్లు విస్తరించాయన్నారు. ఈ మేరకు కొత్త డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో లింగ అసమానతలపై కూడా ఆమె విశ్లేషణ అందించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వహీదుద్దీన్ ఖాన్ ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్ అవార్డు-2025లను డాక్టర్ ఓంప్రణతి, డాక్టర్ ఎం, శ్రీనివాసులకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెస్ వ్యవస్థాపక సభ్యుడు ప్రొఫెసర్ మహేందర్ రెడ్డి, గవర్నింగ్ బోర్డు సభ్యురాలు ఫాతిమాఅలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధి చేసి చూపిస్తా

ఎర్రగడ్డ, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ ప్రజలు తనను ఎంతగానో ఆదరించి ఎమ్మెల్యేను చేశారని, వారి అభిమానానికి మించి జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్.. ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో మంగళవారం ఫలాహ్-ఎ-మిల్లత్ ట్రస్ట్ సభ్యులు ఎమ్మెల్యేకు అభినందన సభ ఏర్పాటు చేసి సన్మానించారు. గత ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇప్పటి నుంచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. అవకాశం లభించే ప్రతీ వేదికలో ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్‌లోని బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్యలైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఫలాహ్-ఎ-మిల్లత్ ట్రస్ట్ సభ్యులు జావిద్, మహమ్మద్ అజర్, షరీఫ్ ఖాన్, అజీజ్, నైముద్దీన్, దస్తగిర్, నబీ, లాలు, ఫెర్రోస్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను సన్మానిస్తున్న ఫలాహ్-ఎ-మిల్లత్ ట్రస్ట్ సభ్యులు

గాయపడిన హిజ్రా మృతి

● ట్రాన్స్‌జెండర్ల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో మూడుకు చేరిన మృతుల సంఖ్య



నవనీత (ఫైల్)

బోరబండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్ల గ్రూపు నాయకురాలి వేధింపుల నుంచి కాపాడాలని చేస్తున్న ఆందోళనలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హిజ్రా నవనీత పటేల్(24) కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించింది. దీంతో ఈ ఘటనలో మృతిచెందిన వారి సంఖ్య మూడుకు చేరుకుంది. బోరబండ పోలీసులు తెలిపిన ప్రకారం.. హిజ్రాల గ్యాంగ్ లీడర్ మోనాలిసా వేధింపుల నుంచి కాపాడాలంటూ బోరబండ బస్టాప్ వద్ద గత సోమవారం 17న అనేకమంది ట్రాన్స్ జెండర్లు ప్లకార్డులతో ఆందోళన చేపట్టడం, పలువురు హిజ్రాలు ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకోవడం, ఎనిమిది మందికి గాయాలవ్వడం విదితమే. ఇందులో 54 శాతం కాలిన గాయాలతో అక్కడ చికిత్స పొందుతూ బోరబండ సైట్-1 కాలనీలో నివసించిన హిజ్రా నవనీత పటేల్ మంగళవారం ఉదయం మృతిచెందింది. ఆమె మృతితో మరణించిన వారి సంఖ్య మూడుకు చేరింది. ఆమె మృతదేహాన్ని ఆస్పత్రి వర్గాలు పోస్టుమార్టం చేయకుండా కుటుంబ సభ్యులకు అప్పగించడంతో వారు కర్ణాటకకు తీసుకుని వెళ్లారు. పోస్టుమార్టం నిమిత్తం బోరబండ ఎస్.ఐ. కాశప్ప కర్ణాటకకు వెళ్లారు. ఈ కేసులో రిమాండ్‌కు తరలించిన మోనాలిసాను తమ కస్టడీలోకి తీసుకునేందుకు బోరబండ పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

కార్మిక భద్రతా పరిధిలో జర్నలిస్టులు

పంజాగుట్ట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తమ పోరాటాల ఫలితంగానే డిజిటల్ మీడియా, టీవీ, రేడియో జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్ట్ గుర్తింపు లభించిందని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ)జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ అన్నారు.మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలో నాలుగు కార్మిక కోడ్‌లు అమల్లోకి వచ్చిన వెంటనే డిజిటల్ మీడియా, టీవీ, రేడియో జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్ట్ గుర్తింపు లభించిందన్నారు. దీని వెనకాల తమ దీర్ఘకాల పోరాటం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాత్రికేయుల నిర్వచనాన్ని విస్తృతం చేసిందని తెలిపారు. ఇప్పటివరకు వర్కింగ్ జర్నలిస్ట్ అనే పదం ప్రధానంగా వార్తాపత్రికలు, ప్రింట్ మీడియా, వార్తా సంస్థలకే పరిమితమైందన్నారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా, టీవీ, రేడియో జర్నలిస్టులకు వేజ్ కోడ్, సోషల్ సెక్యూరిటీ కోడ్, ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ లు అమలు అవుతాయన్నారు. సమావేశంలో డబ్ల్యూజేఐ నాయకులు పాల్గొన్నారు.

తాను చనిపోతూ.. ముగ్గురి జీవితాల్లో వెలుగులు..

● బ్రెయిన్‌డెడ్ వృద్ధుడి అవయవదానం



రామస్వామి(ఫైల్)

నిమ్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్ అయిన వృద్ధుడు తాను చనిపోతూ ముగ్గురికి ప్రాణదానం చేశారు. నల్గొండ జిల్లా చందూరు కనకదుర్గ స్ట్రీట్‌కు చెందిన పాలకూరి రామస్వామి (75) ఓ రైతు. ఈనెల 20న తెల్లవారు జాము 5 గంటల సమయంలో పొలానికి వెళ్తున్నాడు. ఆకస్మాతుగా వచ్చిన బైకు ఆయన్ను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకొని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు.. 24వ తేదీ సోమవారం రామస్వామి బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. అవయవదానంపై జీవన్ దాన్ వైద్యులు ఆయన కొడుకు ఆంజనేయులకు అవగాహన కల్పించారు. అవయవదానానికి అంగీకరించడంతో వృద్ధుడి శరీరం నుంచి లివర్, రెండు కార్నియాస్ సేకరించి వాటితో ముగ్గురి ప్రాణాలను కాపాడారు.

యువతితో అసభ్య ప్రవర్తన..

● ఏఆర్ కానిస్టేబుల్‌కు రిమాండ్

యూసుఫ్‌గూడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఏఆర్ కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బోరబండ రాజా పరిధిలో 2018 బ్యాచ్‌కు చెందిన యు.సాగర్ ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 21న ఉదయం మధురానగర్ బీ-బ్లాక్‌లోని గరుడ టిఫెన్ సెంటర్ నుంచి ఓ యువతి నడుచుకుంటూ వెళ్తోంది. వెనుక నుంచి ద్విచక్ర వాహనం పై వస్తున్న అతను సదరు యువతి ప్రైవేటు పార్ట్‌ను తాకి వేగంగా వాహనాన్ని నడుపుకొని వెళ్లాడు. ఇదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ ఇద్దరు కానిస్టేబుల్‌తో సంఘటన జరిగిన పరిసర ప్రాంతాలో ఉన్న సీసీ ఫుటేజీలను రెండు రోజులుగా క్షుణంగా పరిశీలించి సాగర్‌ను గుర్తించి అదుపులోని తీసుకొని విచారించారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

మరో సంఘటనలో రిమాండ్

జవ హర్‌నగర్‌కు చెందిన యువతి ఒక ఆలయానికి వెళ్లిగా ఆమెతో గుర్తు యువకుడు అసభ్యంగా ప్రవర్తించి ఇక్కడి నుంచి పారిపోయాడు. ఈ సంఘటనలో రహ్మత్‌నగర్‌కు చెందిన షేక్ సైఫ్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● సైబరాబాద్ కమిషనరేట్ ఎదుట డివైడర్ తొలగింపు

● రద్దీ సమయంలో ఒకే మార్గంలో రెండు వైపులా రాకపోకలకు అవకాశం

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో పెరిగిన ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం క్షేత్రస్థాయిలో పరిష్కారం దిశగా చర్యలు చేపట్టింది. మాదాపూర్, రాయదుర్గం వైపు నుంచి గచ్చిబౌలి మీదుగా శేరిలింగంపల్లి, ఔటర్ రింగు రోడ్డు వైపు వెళ్లే వాహనాలతో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఎదుట నిత్యం విపరీతమైన ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రద్దీ సమయాల్లో బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి గచ్చిబౌలి ఓఆర్ఆర్ జంక్షన్ వరకు సుమారు 2 కి.మీ మేర ట్రాఫిక్ నిలిచిపోతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ జి.హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కొంతం చంద్రశేఖర్ రెడ్డి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో ఉన్న రోడ్డు డివైడర్‌ను సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయం సమీపంలో తొలగించి ట్రాఫిక్ తక్కువగా ఉన్న మార్గంలో వాహనాలను మళ్లిస్తున్నారు.

రోజూ 3 గంటల పాటు మళ్లింపు..

రాయదుర్గం బయోడైవర్సిటీ చౌరస్తా నుంచి గచ్చిబౌలి ఓఆర్ఆర్ జంక్షన్ వెళ్లే మార్గంలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వాహనాలను మళ్లిస్తున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ జి.హనుమంతరావు తెలిపారు. ఎటువైపు ట్రాఫిక్ రద్దీ తక్కువగా ఉంటే ఆ మార్గంలో బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలను మళ్లిస్తున్నామని, ఈ ప్రక్రియను ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది నిత్యం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. సాయంత్రం రద్దీ సమయంలో 3 గంటల పాటు మళ్లింపు చేపట్టడం వల్ల ఇళ్లకు వెళ్లే ఐటీ ఉద్యోగులకు ఎంతో ఊరట కలుగుతుందన్నారు. సుమారు రెండు కిలో మీటర్లకు పైగా వాహనాలు ఎదురెదుగా వచ్చినా ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ కోన్స్ ఏర్పాటు చేసి తమ సిబ్బంది ట్రాఫిక్ రద్దీని నియంత్రిస్తుంటారని ఆయన పేర్కొన్నారు.



రోడ్డు డివైడర్‌ను తొలగించడంతో ఒకే మార్గంలో ఎదురెదురుగా వెళ్తున్న వాహనాలు



కార్పొరేటర్ విజయారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

ప్రమాణ స్వీకారానికి రండి

● కార్పొరేటర్ విజయారెడ్డిని ఆహ్వానించిన ఎమ్మెల్యే నవీన్

ఖైరతాబాద్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో ప్రచారం చేసిన టీపీసీసీ నాయకురాలు, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డిని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వానించారు. మంగళవారం ఖైరతాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో ఆమెను నవీన్ కలిసి సత్కరించారు. ఎమ్మెల్యేను విజయారెడ్డి తన్కరించి మిఠాయిలు తినిపించారు. ఎన్నికల్లో పీజేఆర్ తనయగా విజయారెడ్డి చేసిన ప్రచారం తనకు ఎంతో ఉపయుక్తమైందని అందరి ఆశీస్సులతో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి పనులపై ..

ఖైరతాబాద్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని విజయారెడ్డి విన్నవించారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ ఉప కమిషనర్ శ్రీనివాస్, అధికారులను ఆమె కలిశారు. దుర్గానగర్‌లో మూడు సీసీ రోడ్ల పనులు, నవీన్ నగర్ కమ్యూనిటీ హాలు మరమ్మతు పనులు, ఖైరతాబాద్ బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ మైదానంలో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందులో డీఈ చైతన్య, ఏఈ చరణ్ తదితరులున్నారు.



ఎస్‌ఈ కరుణాకర్ బాబు, డీఈ బాలకృష్ణతో మాట్లాడుతున్న మధురానగర్ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, కాలనీవాసులు

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

వెంగళరావునగర్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, స్థానికులు అధికారులను విన్నవించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖ డీఈ బాలకృష్ణతో కలిసి ఎస్ఈ కరుణాకర్ బాబు మంగళవారం కాలనీలో పర్యటించారు. యూసుఫ్‌గూడ ఫీడర్ వల్ల ఈ, ఎఫ్, జి బ్లాక్‌లలో, ఎఫ్-56 నుంచి ఎఫ్-62 మధ్య విద్యుత్ స్తంభం లేకపోవడంతో విద్యుత్ తీగలు తగిలి తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు వారి దృష్టి తీసుకొచ్చారు. విద్యుత్ స్తంభాల మధ్య బంచ్ కేబుల్స్ ఏర్పాటు చేయాలని, అదనంగా మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఏడీఈ హనుమంతరావు, ఏఈ తిరుపతిరావు, సమితి ప్రతినిధులు సాయి కుమార్, సత్యనారాయణ రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

'రౌండ్ టేబుల్ సమావేశానికి ఆహ్వానిస్తాం'

బోరబండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఈ నెల 28న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ బహుజన కూటమి నాయకులు ప్రకటించారు. రాజకీయ, కుల, ప్రజా, మేధావి సంఘాల ప్రతినిధులను ఆహ్వానించనున్నట్లు సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు వెల్లడించారు. 'పెన్నులపై మన్ను కప్పితే.. గన్నులై మొలుస్తాయి' అని అందెశ్రీ సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని అంటూ, బీసీ బిడ్డల ఆశలు, అవకాశాలపై మన్ను పోస్తే.. గన్నులై మొలకెత్తాల్నా? ఫిరంగులై మీ కోటలు బద్దలు కొట్టాల్నా? అని ప్రశ్నించారు. కూటమి అధ్యక్షుడు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల వాయిదా కోరడం లేదని, 42 శాతం రిజర్వేషన్ల సాధనే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ బహుజన కూటమి గౌరవ అధ్యక్షుడు వీజేఆర్ నారగోని మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ చేసిన కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తూనే ఉందని విమర్శించారు. కూటమి వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం నాటకంగా మారిందని దుయ్యబట్టారు. బీసీ సంఘాలు, రాజకీయ సంఘాల్లో ఐక్యత లేకుండా పోయిందని తెలిపారు. 28న నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో ఆత్మ స్తుతి-పరనింద ఉండదని చెప్పారు. కూటమి కన్వీనర్ శేషగిరిరావు, ఇండియన్ సెక్యులర్ పార్టీ కన్వీనర్ డేవిడ్ ఆండ్రూ జేవియర్ పాల్గొన్నారు.



అంబేడ్కర్‌నగర్ బస్తీలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న శ్రీగణేశ్

సమస్యల పరిష్కారానికే బస్తీల పర్యటన

సికింద్రాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లోని బస్తీల పర్యటనలో భాగంగా స్థానిక సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ మంగళవారం 3వ వార్డులోని అన్నానగర్, అంబేడ్కర్‌నగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రోడ్ల సమస్యలను గుర్తించారు. వెంటనే అధికారులకు ఆయన ఫోన్ చేసి, ఆ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను నిరంతరం ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తుంటానని, అందుకే బోర్డు సమావేశాల్లో సైతం ప్రజల సమస్యలను ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. కంటోన్మెంట్ అభివృద్ధికి సీఎం సంవృద్ధిగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు కాంగ్రెస్ నాయకుడు ఎస్.రాజేష్‌యాదవ్, మహేష్, మురళి, గోపి, గిరి, అజ్గర్, శ్రీనివాస్‌గౌడ్, జమీల్, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ సెలబ్రేషన్స్

చిలకలగూడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్‌లోని తార్నాక, విజయపురిలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో మంగళవారం నిర్వహించిన వేడుకలకు డివిజన్ కార్పొరేటర్ రాసూరి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చి ప్రతినిధులు ఆమెను ఘనంగా సత్కరించారు.



కార్పొరేటర్ రాసూరి సునీతను సత్కరిస్తున్న చర్చి ప్రతినిధులు



బోయినపల్లి సంజీవయ్య కాలనీలో నెలకొన్న సమస్యలు తెలుసుకుంటున్న భానుక నర్మద

రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తాం

బోయినపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు ఒకటో వార్డులోని సంజీవయ్య కాలనీలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను రెండు రోజుల్లో పూర్తి చేస్తామని కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద పేర్కొన్నారు. ఈ కాలనీలో రోడ్డు నిర్మించలేదన్న స్థానికుల ఫిర్యాదు మేరకు బోయినపల్లిలోని ఒకటో వార్డు సంజీవయ్యనగర్ కాలనీ చిన్నతోకట్టలో సుమారు రూ.6 లక్షల బోర్డు నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక వాసులతో సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఒకటో వార్డు బీజేపీ అధ్యక్షుడు జైపాల్ రాకేష్ సింగ్, బీజేపీ వార్డ్ కోశాధికారి దత్తాత్రేయ నామాజీ, మహిళా నాయకురాలు అనిత, స్థానిక సంజీవయ్య నగర్ కాలనీ అధ్యక్షుడు దాసరి అశోక్, సోషల్ వర్కర్ రామారావు, జైహింద్ స్థానిక మహిళలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సికింద్రాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రసూల్‌పురా బస్తీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కంటోన్మెంట్ సీఈఓ అర్వింద్‌కుమార్ ద్వివేదికి బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం బోర్డు కార్యాలయంలో సీఈఓను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రోడ్లు అధ్వానంగా మారాయని, తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, మురుగు సమస్య తీవ్రంగా ఉందని, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయిందని వివరించారు. బీఆర్ఎస్ నాయకుడు సంతోష్ పాల్గొన్నారు.



సీఈఓ అర్వింద్‌కుమార్ ద్వివేదిని కలిసిన టి.ఎన్.శ్రీనివాస్



శస్త్రచికిత్స అనంతరం చిన్నారితో వైద్య బృందం

రెండేళ్ల చిన్నారికి హైడ్రోసెఫాలస్ శస్త్రచికిత్స

రెజిమెంటల్‌బజార్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అత్యంత క్లిష్టమైన న్యూరోలాజికల్ పరిస్థితి అయిన కాంప్లెక్స్(మల్టిలోక్యూలేటెడ్)హైడ్రోసెఫాలస్ కారణంగా అరుదుగా కనిపించే బాబుల్ హెడ్ డాల్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న రెండేళ్ల చిన్నారికి సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. మెడికవర్ న్యూరోసర్జరీ బృందం న్యూరో నావిగేషన్‌తో కూడిన అధునాతన న్యూరో ఎండోస్కోపీ ద్వారా మెదడుకు అత్యంత కీలకమైన చికిత్స అందించినట్టు డాక్టర్.రమేశ్ శిఘకొల్లి, సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్, డా.భవాని శంకర్ శ్రీనివాస్,చీఫ్ అనస్తీషియన్ అండ్ హెచ్ఓడీ తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి అవగాహన, స్పందన, అభివృద్ధి దశల్లో గణనీయమైన పురోగతిని చూపుతోందని వైద్యులు తెలిపారు.

తాగునీటి లీకేజీ సమస్యకు పరిష్కారం

తిరుమలగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానికులకు మెరుగైన నీటి సరఫరాను అందించాలని కంటోన్మెంట్ అధికారులకు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌లు కోరారు. బొల్లారం అయ్యప్ప టెంపుల్, డౌటన్ బజార్‌లలో కొంత కాలంగా తాగునీరు తక్కువగా సరఫరా అవుతుందని సూచించారు. వారి విజ్ఞప్తి మేరకు అధికారులు మంగళవారం అన్ని వాటర్ సప్లయ్ పాయింట్లను చెక్ చేశారు. అయితే డౌటన్ బజార్ భూలక్ష్మమ్మ దేవాలయం వద్ద లీకేజీ గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టారు. జీవి బాల్‌రాజ్, గాంధీ, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల నిలయం..

లాలాగూడ రైల్వేస్టేషన్

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- తాగునీరు, మరుగుదొడ్లు కరువు
- పట్టించుకోని అధికారులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ముందు స్టేషన్‌గా ఉన్న లాలాగూడ రైల్వే స్టేషన్ నుంచి మేడ్చల్ వైపునకు వెళ్లడానికి ఇక్కడ ఎంఎంటీఎస్ రైళ్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగుతాయి. కానీ ప్రయాణికులు టికెట్ తీసుకోవాలంటే మూడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఎక్కి దిగాల్సిందే. దీంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు ఈ రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారులు తనిఖీలు చేసిన దాఖలు లేకపోయింది. ప్రయాణికుల భద్రతపై చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న రైల్వే అధికారులు ఈ రైల్వే స్టేషన్ వైపునకు కన్నెత్తి కూడా చూడడంలేదు. లాలాగూడ రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ఎంఎంటీఎస్‌లో ఎవరూ ప్రయాణించకపోవడంతో టికెట్లు అమ్ముడు పోవడంలేదు. అలాగే రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్నా ఆర్పీఎఫ్ పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

తెల్లవారుజాము నుంచే రాకపోకలు

ఈ రైల్వే స్టేషన్ నుంచి 33 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. పదిహేనేళ్లుగా ఈ స్టేషన్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు ప్లాట్‌ఫాంలు ఉన్న ఈ స్టేషన్‌లో తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారంటూ పలు ఆరోపణలు ఉన్నాయి. ఈ స్టేషన్‌లో తెల్లవారుఝామున నుంచి రాత్రి 12 గంటల వరకు బుకింగ్ కార్యాలయం తెరిచి ఉండాల్సి ఉండగా సాయంత్రం ఐదు గంటలకే కౌంటర్‌ను మూసివేస్తున్నారు. దాంతో ప్రయాణికులు టికెట్ లేకుండా రైళ్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉపయోగంలేని మరుగుదొడ్లు

లాలాగూడ రైల్వే స్టేషన్‌లో కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. బుకింగ్ కౌంటర్ పక్కనే ఉన్న రెండు మరుగుదొడ్లు ఉపయోగంలో లేవు. ఇప్పటికైనా లాలాగూడ రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు

ఈ స్టేషన్‌లో రాత్రి 8 అయిందంటే చాలు ప్లాట్‌ఫాంపైనే మందు బాబులు మద్యం సేవించి ప్రయాణికులను ఇబ్బందులు పెడుతున్నారు. నిర్మానుష్యంగా ఉన్న ఈ స్టేషన్‌లో పేకాట ఆడుతూ అసాంఘిక కార్యకలపాలకు పాల్పడుతున్నారు. రైల్వే ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలు లేకపోవడంతో వీరు రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా ఆర్పీఎఫ్ పోలీసులు రైల్వే స్టేషన్‌లో గస్తీ తిరుగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





ప్లాట్ ఫారంకు దూరంగా ఉన్న బుకింగ్ కార్యాలయం, లాలాగూడ రైల్వే స్టేషన్ బోర్డు



లాలాగూడ రైల్వే స్టేషన్‌లో పని చేయని మంచినీటి కుళాయి



టికెట్ తీసుకోవాలంటే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కాల్సిందే

ఎక్సలేటర్ ఏర్పాటు చేయండి



రైల్వేస్టేషన్‌లో టికెట్ తీసుకుని రైలు ఎక్కాలన్నా, ప్లాట్‌ఫాం-1కి రావాలన్న మూడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు మీదుగా నడువాల్సిన పరిస్థితి ఉంది. అందుకే రెండు వైపులా ఎక్సలేటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఎక్సలేటర్ ఏర్పాటు చేస్తే నిర్భయంగా రైలు టికెట్ తీసుకుని ప్రయాణం చేస్తారు. స్టేషన్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్లనే ప్రయాణికులు ఈ స్టేషన్‌ను అంతగా పట్టించుకోవడంలేదు.

- సునీత, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ

గస్తీ ఏర్పాటు చేయండి



లాలాగూడ రైల్వే స్టేషన్ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న లాలాగూడ రైల్వే స్టేషన్ భద్రతను ఆర్పీఎఫ్ పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. పలుమార్లు ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నా ఎవరు రావడంలేదు. ఇప్పటికైనా రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కట్టా లక్ష్మి, శాస్త్రినగర్

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన అవసరం

- డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

పద్మారావునగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని గాంధీనగర్ పీఎస్ డీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. హైదరాబాద్ నగర కమిషనర్ సూచనల మేరకు నగరవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాగృత్ హైదరాబాద్, సురక్షిత్ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని చాచానెహ్రూనగర్‌లో ప్రజా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈజీ మనీ కోసం సైబర్ నేరగాళ్ల వలలో పడి ప్రజలు మోసపోవద్దని తెలిపారు. సమాజంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరాల నుంచి ప్రజలకు రక్షణ కలిగిస్తూనే, అనేక ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్యం పరుస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలు జరిగే తీరును ప్రతీ ఒక్కరూ తెలుసుకొని, ఇతరులకు తెలపాలని సూచించారు. అనుమానస్పద కాల్స్, లింక్స్, యాప్‌లను నమ్మవద్దని తెలిపారు. అలాగే ఓటీపీ, పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ తెలపవద్దని అన్నారు.ఏదైనా మోసానికి గురైన పక్షంలో 1930 నేషనల్ హెల్ప్‌లైన్‌కి కాల్ చేయాలని తెలిపారు. ఏదైనా సైబర్ మోసానికి గురైన సందర్భంలో గంటలోపు హెల్ప్‌లైన్‌కి ఫోన్ చేస్తే పోయిన డబ్బులు దక్కించుకోవటానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వై.శ్రీనివాస్ ముదిరాజ్,వై.సురేశ్‌లు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఐ వెంకటేశ్వర్లు, బస్తీవాసులు

ఆకట్టుకున్న నగర్ కీర్తన్

రెజిమెంటల్‌బజార్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదవ సిక్కు గురువు శ్రీ గురు తేజ్ బహదూర్ సాహెబ్ 350వ షహీదీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన రంగురంగుల నగర్ కీర్తన్(పవిత్ర ప్రదర్శన) విశేషంగా ఆకట్టుకొంది. మానవ హక్కులు, మత స్వేచ్ఛ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన గురు తేజ్ బహదూర్ సాహబ్‌జీ మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ నిర్వహిస్తున్న నగర్ కీర్తన్, విశాల్ కీర్తన్ దర్బార్లు భక్తులను ఆధ్యాత్మిక పారవశ్యానికి చేర్చాయి. ఈ కార్యక్రమాన్ని గురుద్వార్ సాహెబ్ సీతాఫల్‌మండి, సికింద్రాబాద్ ప్రభందక కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని గురుద్వారాల సహకారంతో నిర్వహించారు. నగర్ కీర్తన్ గురుద్వారా సాహెబ్ సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై గురుద్వారా సాహెబ్ సీతాఫల్‌మండి వద్ద ముగిసింది. ప్రభందక కమిటీ చైర్మన్లు హర్పాల్ సింగ్, కంచన్ సింగ్, అధ్యక్షుడు ప్రతాప్ సింగ్, ఉపాధ్యక్షుడు రాజేందర్ సింగ్, ప్రధాన కార్యదర్శి రంజిత్ సింగ్, సంయుక్త కార్యదర్శి అండ్ కోఆర్డినేటర్ జగ్జీత్ సింగ్‌లు పాల్గొన్నారు. నగర్ కీర్తన్‌లో అందంగా అలంకరించిన వాహనంపై శ్రీ గురు గ్రంధ్ సాహెబ్‌ను ప్రతిష్ఠించారు. అద్భుతమైన గట్కా యోధ కళను ప్రదర్శించారు.



గురుద్వార్‌లో పూజలు చేస్తున్న సిక్కులు



సింధి కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

బేగంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. మంగళవారం బేగంపేట డివిజన్ సింధి కాలనీలో అధికారులతో కలిసి ఆమె పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా తాగునీరు సక్రమంగా రావడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని, మురుగునీరు సమస్య అధికంగా ఉందని స్థానికులు దృష్టికి తీసుకొచ్చారు. అక్కడే ఉన్న అధికారులతో ప్రజలతో మాట్లాడించారు. ఆయా సమస్యలను వీలైనంత వరకు త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పది సంవత్సరాలబీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి ఆగిపోయిందని, తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ, ఎలక్ట్రికల్‌తో పాటు ఆయా విభాగాలకు చెందిన అధికారులు, బేగంపేట కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశాల్‌సుదాం పాల్గొన్నారు.

రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా అశిష్ మోహ్రెతా

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దక్షిణమధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా అశిష్ మోహ్రెతా మంగళవారం రైల్ నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. రైల్వేలో ఐఆర్ఎస్ఈఈ సర్వీస్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్, ఉత్తర రైల్వేలో చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఇంజనీర్‌తో పాటు న్యూఢిల్లీ నార్తర్న్ రైల్వేలో చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేశారు. 1995లో రాష్ట్రపతి మెడల్‌తోపాటు 2006లో రైల్వేమంత్రి చేతుల మీదుగా అవార్డు, 2023లో రైల్‌సేవా పురస్కార్ వంటి అనేక అవార్డులు అందుకున్నారు.

ఓయూను క్లోజ్డ్ క్యాంపస్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీని క్లోజ్డ్ క్యాంపస్‌గా ప్రకటించాలని ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షుడు మేడ శ్రీను డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓయూ క్యాంపస్‌లో బయట వ్యక్తుల హడావుడి, అక్రమాలు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. 24 గంటలు గేట్లు మూసివేయడం, బయట వాహనాలు రానివ్వకుండా, కిరాణ సిగరెట్ దుకాణాల మూసివేత, ర్యాలీలు, షూటింగ్‌లను నిషేధం, విద్యార్థులకే క్రీడా ప్రాంగణం, క్యాంపస్‌లో స్టేషనరీ ఏర్పాటు వంటి 13 కీలక డిమాండ్లను ప్రకటించారు. బయటి వ్యక్తుల అసాంఘిక చర్యలపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులందరూ దీనికి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు మోహన్ కుమార్ బట్టపోతుల, నిత్య రెడ్డి, అభిలాష్, భూక్యా అనిల్, ఓం ప్రకాష్, అజయ్, పూర్ణచంద్ర యాదవ్ పాల్గొన్నారు.



బోయినపల్లి ఏడుగుడుల దేవాలయంలో ప్రత్యేక పూజలకు హాజరైన మహేశ్వర్ రెడ్డి

ఘనంగా ఏడుగుడుల దేవాలయ వార్షికోత్సవం

బోయినపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి చిన్నతోకట్ట ఏడుగుడుల దుర్గామాత దేవాలయం వార్షిక మహోత్సవాన్ని మంగళవారం ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణం చేపట్టి 37 సంవత్సరాలు పూర్తి చేసుకుని 38లోకి అడుగుపెట్టిన సందర్భంగా నిర్వహించిన వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి అర్చన, వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత అమ్మవారు ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరి వెంకటేశ్ యాదవ్, అల్లం శుభాష్, అల్లం విష్ణు, బాల మల్లేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

బౌద్ధనగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ సంజీవపురంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ స్తంభం కింద తుప్పుపట్టి ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానిక కాంగ్రెస్ నాయకుడు జీఎన్ చారి తెలిపారు. అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే దానికి అధికారులు, ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుప్పుపట్టిన స్తంభం స్థానంలో నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.




ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



సీఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి చిన్నారెడ్డి

సీఎం ప్రజావాణికి 383 దరఖాస్తులు

బేగంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి మొత్తం 383 దరఖాస్తులు వచ్చాయి. ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లు అర్జీలు తీసుకోవడంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా జిల్లాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు 117, రెవెన్యూకు 51, ఇందిరమ్మ ఇళ్ల కోసం 111, నీటి పారుదల శాఖకు 46, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇతర శాఖలకు చెందిన 57 దరఖాస్తులు వచ్చినట్లు చిన్నారెడ్డి తెలిపారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే బలాల

పండ్ల మార్కెట్‌ను పునః ప్రారంభించండి

- మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే బలాల వినతి

చాదర్‌ఘాట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పండ్ల వ్యాపారుల సౌకార్యార్థం పహడీషరీఫ్‌లో ఏర్పాటు చేసిన పండ్ల మార్కెట్‌ను పునర్ ప్రారంభానికి చర్యలు చేపట్టాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల కోరారు. ఈ మేరకు మంగళవారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఎమ్మెల్యే కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పహడీషరీఫ్ పండ్ల మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి సత్వరమే పునర్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పండ్ల మార్కెట్‌ను పునర్ ప్రారంభించడం ద్వారా వందలాది మంది పండ్ల వ్యాపారులు ఉపాధి పొందే అవకాశముందని ఆయన అన్నారు.

రాష్ట్రంలో 4 లేబర్ కోడ్‌లను అమలు చేయొద్దు

టీయూడబ్ల్యూజే రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

బర్కత్‌పుర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నూతనంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయొద్దని టీయూడబ్ల్యూజే రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. ఈ 4 లేబర్ కోడ్‌లు అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఇందు కోసం త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విరాహత్ అలీ, రాంనారాయణ వెల్లడించారు. 4 లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జరిగే ఆందోళన కార్యక్రమాల్లో తమ యూనియన్ భాగస్వామ్యమవుతుందన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంయుక్త ఆధ్వర్యంలో కార్మిక వర్గం- 4 లేబర్ కోడ్‌లు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, కార్పొరేట్ సంస్థల ప్రభావం మీడియాపై బలంగా ఉందన్నారు. 4 లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులతో పాటు ఉద్యోగులు పరోక్షంగా తమ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ, లేబర్ కోడ్‌లవల్ల కొత్త ప్రమాదం వచ్చే అవకాశం ఉందని, కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు మాట్లాడుతూ, ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికి అనేక కుట్రలు జరుగుతున్నాయని, లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ, 4 లేబర్ కోడ్‌లపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్, బాల్‌రాజ్ మాట్లాడుతూ, 4 లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు సమ్మె చేసే అవకాశం లేదని ఆరోపించారు. యాజమాన్యాలకు అనుకూలంగా ఈ కోడ్‌లను తీసుకొచ్చారని, వీటికి వ్యతిరేకంగా ఈ నెల 26న జరిగే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఐజేయూ జాతీయ కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డి, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్య, ఎస్.ఎల్.పద్మ, ఏఐయూటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు భరత్, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి వర్కాల యాదగిరి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, హెచ్‌యుజే అధ్యక్షుడు సిహ శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి